# రాంగ్ నంబర్

మల్లిక్



"ప్రమీలా, నేను ఆఫీసుకు వెళ్తున్నా తలుపేసుకో..." అంటూ ఓ కేక పెట్టి బయటికి వెళ్ళబోయిన మధు ఆగి మళ్ళీ లోపలికి వచ్చాడు.

"చూడు ప్రమీలా ... టూత్‌పేస్టు అయిపోయినట్టుంది... బజారునుండి వెంకన్నతో తెప్పించు...షేవింగ్ సెట్ సూట్‌కేసులో సర్దడం మర్చిపోయేవు సుమా ! ... పోయినసారి క్యాంపుకు వెళ్ళినప్పుడు టవల్స్ పెట్టడం మర్చి

పోయావు గుర్తుందా ? ..." మధు చెప్తున్నదంతా ఏడుపుముఖం పెట్టుకుని వింటుంది ప్రమీల.

"ఇదిగో నువ్వు ముఖం అలా పెడితే ఇప్పుడు నాకు ఆఫీసుకు కూడా వెళ్ల బుద్ధికాదు. ఎంత ? రెండురోజుల్లో క్యాంపునుండి వచ్చేస్తానుగా. విజయవాడ వెళ్లే బస్సు సాయంత్రం నాలుగుగంట లకు ఉంది. నేను ఆఫీసునుండి రెండు గంటలకు ఇంటికి వచ్చేస్తాను. అప్పుడు నన్ను నవ్వుతూ ఊరికి పంపించాలి... ఈ రెండురోజులూ నీకు కాలక్షేపం కోసం బోలెడన్ని నవలలూ, పత్రికలూ కొని తెస్తానుగా !......"

ప్రమీల మధు గుండెలమీద వాలిపోయింది

"మీకు దూరంగా ఉండలేనండీ..."

మధు తృప్తిగా నవ్వుకున్నాడు.

"ఓహ్... ఆఫీసుకు టైమైపోయింది, మరి నేనిక వెళ్లొస్తాను..." అంటూ ప్రమీల బుగ్గమీద తీయని ముద్ర ఒకటి వేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

తన క్రింద పనిచేస్తున్న గుమస్తాల నమస్కారాలను అందుకుంటూ తన గదిలోనికి వెళ్ళాడు మధు ఒక గంట సేపు ఫైల్లు చూశాడు. తరవాత టెలిఫోను తీసి ఒక నెంబరు డయల్ చేశాడు

"హలో..."

"హలో..." అంది అవతలి కంఠం. ఎవరిదో స్త్రీ కంఠస్వరమే అది.

"సుశీల ఉందా ?......" అని అడిగాడు మధు.

"సుశీలా ?!... ఏ సుశీల ??... ఇక్కడెవరూ సుశీల పేరుగలవాళ్ళు లేరు ...రాంగ్ నెంబర్..." ఆమె టెలిఫోను డిస్కనెక్ట్ చేసింది.

మధు నిట్టూర్చాడు. మళ్ళీ ఏదో నెంబరు డయల్ చేశాడు.

"హలో......" ఎవరిదో పురుష కంఠం.

ఛ...ఛ... ఎవడో వెధవ తగిలాడు అనుకున్నాడు మధు.

"హలో ...హలో ...హలో ..." అవతలి మనిషి అరిగిపోయిన రికార్డు లాగా అంటున్నాడు.

"రాంగ్ నెంబర్" అంటూ విసుగ్గా ఫోను పెట్టేశాడు మధు.

ఇంకో నెంబరు డయల్ చేశాడు.

"హలో...లలితా హియర్."

"హాయ్ లలితా..." అన్నాడు మధు ఉత్సాహంగా.


"హలో ... ఎవరూ ?!..."

"నేను లల్లీ మధుని !!..."

"ఏ మధు ??..."

"నన్నే గుర్తుపట్టలేదా డియర్ ?.."

"సారీ...మీ రెవరో నాకు తెలియదు ...మీ రనుకుంటున్న లలితను నేను




కాను..." విసురుగా ఫోను పెట్టేసిన శబ్దం.

ఛ......బ్యాడ్ లక్......ఈ వేళ ముహూర్తం అంత బాగున్నట్టు లేదు అనుకున్నాడు మధు.

మధుకి ఒక పిచ్చి సరదా ఉంది. అదేమిటంటే ఏదో ఒక నెంబరు డయల్ చేసి ఫోనుచెయ్యడం. అవతల ఫోను ఎత్తిన వ్యక్తి స్త్రీ అయితే రొమాంటిక్‌గా మాట్లాడడం, పురుషుడు అయితే రాంగ్ నెంబరని డిస్కనెక్ట్ చేయడం. ఒక్కొక్కప్పుడు చాల గమ్మత్తులు జగురుతుంటాయి. కొందరు స్త్రీలేమో రాంగ్ నెంబరని ఫోను పెట్టేస్తారు. కొందరేమో వాళ్ళుకూడా రొమాంటిక్‌గా మాట్లాడుతారు.

ఒకసారి అలానే...ఏదో నెంబరు డయల్ చేశాడు

"హలో అన్నాడు మధు.

"హలో ... ఎవరు మాట్లాడుతూంట ?..." ఎవరిదో ఆడగొంతు.

"నేను ధర్మేంద్రను !......" అన్నాడు మధు.

"హాయ్ ధర్మేంద్రా...నేను హేమామాలినిని మాట్లాడుతున్నాను" అన్నది ఆమె. మధుకి మతిపోయినట్టయింది.

"ఏం ధర్మేంద్రా ...... ఇన్నాళ్ళ తరువాత ఫోనుచేసి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నావేం ?... ఆమె కంఠంలోని చిలిపితనం మధుకు గిలిగింతలు పెట్టింది.

"నీ కంఠం విని పారవశ్యంలో అలా ఉండిపోయాను హేమా డియర్."

"ఛ...ఉత్త కబుర్లే......అంత ప్రేముంటే ఇన్నాళ్లూ ఎందుకు ఫోను చేయలేదు......నీ కోసం నేనెంత వేగిపోతున్నానో నీకేం తెలుసు..." చిన్నగా నవ్విన శబ్దం.

మధుకి ఇప్పుడు పూర్తిగా మతి పోయింది. తనుకూడా చాల రొమాంటిక్‌గా (పిచ్చి పిచ్చిగా) మాట్లాడేడు.

వాళ్లు అలా పావుగంట మాట్లాడేరు. అంత సేపు మాట్లాడినా ఆమె తన అసలు పేరుగానీ, తన ఫోను నెంబరుగానీ చెప్ప లేదు. మధు తనచేతికి ఏ నెంబరు అందితే ఆ నంబరు డయల్ చేస్తాడు. అందుకనే తనే నెంబరు డయల్ చేశాడో తనకే తెలియదు. మధు ఎంత బ్రతిమిలాడినా ఆ హేమామాలిని తన పేరూ-టెలిఫోను నెంబరూ చెప్పలేదు. కనీసం తన నెంబరైనా ఆమెకు చెప్తే ఆమే మళ్ళీ ఎప్పుడైనా ఫోను చేస్తుందని ఆమెకు తన ఫోను నెంబరు చెప్పాడు. కానీ ఈనాటివరకూ ఆమె మళ్ళీ ఫోను చెయ్యలేదు.

ఇలా ప్రతిరోజూ ఆఫీసు ఫోనును దుర్వినియోగం చెయ్యడం అతని హాబీల్లో ఒకటి ఈరోజు ఎంత ప్రయత్నించినా అతనికి రొమాంటిక్‌గా మాట్లాడేవాళ్ళు దొరకడంలేదు.

మళ్ళీ ఏదో నెంబరు డయల్‌చేశాడు.

"హలో..."

"హలో...మాధవి ఉందా ?..."

"ఎవడ్రా...నువ్వు ?... మాధవి కావాలా ?... దొంగ రాస్కెల్...నీ..." వాడెవడో బండబూతులు తిడుతున్నాడు. మధు వెంటనే ఫోను పెట్టేశాడు. మాధవి అనే ఆమె నిజంగా ఉందా ?... వాడికేమౌతుందో !!... చెల్లెలా ?... కాదు పెళ్లామే అయి ఉంటుంది !!...

మధు చేతిగడియారం వంక చూసుకున్నాడు. పన్నెండైంది. ముఖ్యమైన ఫైళ్లు చూసి త్వరగా ఇంటికి వెళ్ళి పోవాలి. లేకపోతే బస్సు తప్పిపోతుంది అనుకున్నాడు. ఆఖరిసారిగా మరోసారి ఫోనుచేసి ప్రయత్నించి చూద్దామనుకున్నాడు. రెండు కళ్ళూ మూసుకుని తన ఆరాధ్యదైవమైన కృష్ణుడిని తలుచుకుంటూ అలా కళ్ళు మూసుకునే ఒక నెంబర్ డయల్ చేశాడు.

"హలో..." ఎవరిదో స్త్రీ కంఠం !

"హలో.. బావున్నారా ?..." మధు ఉత్సాహంగా ప్రశ్నించాడు.

ఆమె ఏదో ప్రశ్నించింది. మధుకు సరిగ్గా వినబడడంలేదు. లైను సరిగ్గా లేదో లేక అవతలి ఫోను సరిగ్గా లేదో!!

"ఏమంటున్నారు ?..." మధు కాస్త గట్టిగా అడిగాడు.

"ఇంతకీ మీరెవరూ అంటున్నాను."

"నన్ను గుర్తుపట్టలేదా ?...ఐమీన్...అదే నా గొంతును..."

"సారీ... ఫోను సరిగ్గా వినబడటం లేదు "

"కానీ మిమ్మల్ని నేను గుర్తుపట్టాను ...మీరు నా ఆరాధ్య దేవత !..."

"అలాగేం .....అలాగయితే నేను కూడా మీ రెవరో గుర్తుపట్టాను...మీరు

కూడా నా ఆరాధ్య దైవమే... అంతే కదూ ?..." తీయని నవ్వు వినిపించింది.

మధు ఎగిరి గంతేసినంత పని చేశాడు. ఆమె మాటలకు రెచ్చిపోయాడు.

"మేడమ్......మీ గొంతు ఎంత తీయగా ఉందో తెలుసా ?...ఇలానే జీవితాంతం మీ గొంతు వింటూనే ఉండిపోవాలనిపిస్తుంది..."

"ఛ...ఇంత చిన్న కోరికా ?!..." ఆ కంఠస్వరంలో చిలిపితనం ధ్వనించింది.

"ఇంకా......ఇంకా చాలా చాలా తీయని కోరికలు ఉన్నాయి...... చెప్పేదా ?..."

"ఊ...చెప్పండి మరి."

మధు అలా ఆమెతో ఒక పావుగంట సేపు తీయగా వేడిగా వాడిగా మాట్లాడాడు. ఆమె కూడా మధుకు ఏమాత్రం తీసిపోలేదు.

"ఏమండీ...ఇంత సేపు మాట్లాడినా మీ పేరు చెప్పలేదు...ఇంతకీ మిమ్మల్ని ఏమని సంబోధించమంటారు ?..." మధు కుతూహలంగా అడిగాడు.

"అమ్మో...... ఆశ !! ... మీరు మాత్రం మీ పేరు చెప్పరేంటి ?...నేను చెప్పను...!"

"ప్లీజ్...ప్లీజ్...కనీసం మీ ఫోను నెంబరు చెప్పండీ..." మధు బ్రతిమలాడాడు

"నా ఫోను నెంబరు తెలియకుండా నా కెలా ఫోను చేశారు...పోనీలే...నేను చెప్తాలేగానీ ఒక్క షరతు."

"చెప్పండి. ఏ షరతుకైనా సిద్ధమే."

"మీరు అప్పుడప్పుడూ మధ్యాహ్నం పూట నాకు ఫోను చెయ్యాలి...ఈ రెండురోజులు మాత్రం మీరు ఎన్ని సార్లు ఎప్పుడు ఫోను చేసినా ఫరవా లేదు..."

"ఓస్...ఇంతేనా... రోజూ ఫోను చెయ్యమన్నా చేస్తాను...మీ నెంబరు ?"

"34670..."

మధు ఉలిక్కిపడ్డాడు ... అది తన ఇంటి ఫోను నెంబరు ...... తను పొరబాటుగా వినడం లేదుకదా ?

"ఏమిటీ ?..."

"34670..."

"మీ పేరు......" అనుమానంతో మధు కంఠం వణికింది.

"ప్రమీల..."

ఓహ్ ...... ప్రమీలా !! రాంగ్ నెంబర్...మధు తలపట్టుకుని కుర్చీలో వెనక్కు పడిపోయాడు.

